# ఆంధ్రయోగులు

## చతుర్థ భాగము



బి. రామరాజు



## 3. సింహాచలం శ్రీరామవిశ్వంభరదాసు (1550-1993)

యోగుల చరిత్రలవలె వారి ఆయుఃప్రమాణాలు కూడ ఆశ్చర్యం కలిగిస్తాయి. క్రియాయోగప్రవక్త శ్యామాచరణ లాహిరీ మహాశయుల (1828-1895) గురువులు మహావతార్ బాబా ఇప్పటికీ ఉన్నారంటారు. ఆయన వయస్సు 1200 ఏండ్లకు పైన ఉంటుందట. హిమాలయాల్లో వందల యేండ్లనుండి తపస్సు చేసుకుంటున్న యోగులు చాలామంది ఉన్నారట. మన తెలుగుదేశంలో కూడ అట్టి దీర్ఘజీవులెందరో ఉండినారు. త్రైలింగస్వామి 280 ఏండ్లు జీవించినారు. సొరకాయలస్వామి 4-5 నూర్లేండ్లవారట కాని చారిత్రకాధారం 202 ఏండ్లున్నట్లు లభించింది. వారి శిష్యుడు ఏకాంబరకుప్పం నందనారుస్వామి కూడ 400 ఏండ్లుండినారట కాని 233 ఏండ్లున్నట్లు చరిత్ర లభించింది. గుంటూరు నల్లమస్తాన్ జీవితకాలం 1685-1885. ఇంత దీర్ఘకాలం జీవించటం వారు సాధించిన యోగం మహిమో లేదా భగవదుద్దేశమో తెలియదు. శ్రీకృష్ణదేవరాయలు (1509-1530) విజయనగరసామ్రాజ్యం పాలిస్తుండగా దక్షిణభారతయాత్రలు చేసినట్లు చెప్పుకొన్నవారు, ఛత్రపతి శివాజీ మహారాజు పట్టాభిషేకం చూచినామన్నవారు ఐన శ్రీరామవిశ్వంభరదాసు జీవితమూ ఆయుఃప్రమాణమూ అద్భుతాశ్చర్యాలు కలిగిస్తవి.



ఆ మహాపురుషుడు 1993దాకా సింహాచలం పైన ఉంటూ వేలసంఖ్యలో ఆశ్రితులను ఆదుకున్న సన్నివేశాలు సంఘటనలు జ్ఞాపకం చేసే అనుభవజ్ఞులు లెక్కకు మిక్కిలి. ఆంధ్రేతరప్రాంతాలనుండి వచ్చి త్రిలింగదేశంలో స్థిరపడిన యోగుల్లో శ్రీరామ విశ్వంభరదాసు ఒకరు.

భారతదేశంలో అతిప్రాచీనమైన పుణ్యక్షేత్రాల్లో కాశి ఒకటి. అది విశ్వనాథుని ఆవాసభూమి. భారతీయవిద్యలకు పట్టుగొమ్మ. అక్కడ మైత్రేయసగోత్రుడు ఆపస్తంబ సూత్రుడైన మాధవస్వామి అనే ద్విజుడుండేవాడు. ఆయన దురదృష్టమేమిటో కాని ఆయనకు ఏడ్గురు సంతానం నిర్జీవులుగానే పుట్టినారు. ఆ పసికందులను గంగలో విడిచి భార్యను ఓదార్చుతూ కాశీవిశ్వనాథునికి కన్నీటిమాలలు సమర్పిస్తూ కాలం గడిపినాడు. రోహిణీనక్షత్రంలో పుట్టిన అష్టమగర్భం కూడ నిర్జీవుడే. ఆ శిశువును కూడ గంగలో విడిచి మాధవశర్మ దుఃఖంతో ఇంటికి తిరిగిపోయినాడు. కాని విధివిలాసం వేరొకతీరుగా ఉండినది. అల్లంత దూరాన అరుణోదయాన నడుముబంటి నీటిలో నిల్చి ఆదిత్యునికి అర్ఘ్యం విడుస్తున్న శ్రీరఘునాథశర్మ అనే బ్రాహ్మణోత్తముని శరీరానికి ఈ శిశువు తగుల్కొని నిలిచిపోయింది. ఆ శిశువును ఆ సద్బ్రాహ్మణుడు చేతుల్లోనికి తీసుకున్నాడు. పసికందు కన్నులు తెరచి ఏడుస్తుంటే భగవత్ప్రసాదంగా గ్రహించి పరుగు పరుగున ఇంటికి పోయి భార్య చేతికిచ్చి సాకుమన్నాడు. దేవకీ వసుదేవుల కడుపు పంటను జ్ఞప్తిచేసే సంఘటనమిది. అలనాడు అష్టమగర్భం శ్రీకృష్ణ పరమాత్ముడు రోహిణీనక్షత్రంలో పుట్టినాడు. ఈనాడు మరల రోహిణీనక్షత్రంలో అష్టమ గర్భంగా పుట్టినవాడు శ్రీరాంవిశ్వంభరదాసు. ఆయన విశ్వంభరుడు. ఈయన విశ్వంభరదాసు. యశోదానందుల వలె శ్రీరఘునాథశర్మ దంపతులు తమకు లభించిన ఈ దైవప్రసాదాన్ని అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేసినారు. ద్విజవిహితమైన జాతకర్మాదులు చేసినారు. రాంవిశ్వంభర్ అని నామకరణం చేసినారు. రఘునాథశర్మ గొప్ప పండితుడు, అధ్యాత్మవిద్యాకోవిదుడు, నిష్ఠాగరిష్ఠుడు.

శ్రీరాంవిశ్వంభరునికి ఐదవయేట అక్షరాభ్యాసము ఎనిమిదవయేట ఉపనయనము జరిగినవి. కన్నప్రేమ కంటె పెంచినప్రేమ ఎక్కువ. వటువు శుక్లపక్ష చంద్రునివలె తన సుగుణాలనే కళలు వెదజల్లుతుంటే రఘునాథశర్మ ఆ బాలుని ఇతర గురువులచెంతకు పంపక తనచెంతనే ఉంచుకొని సమస్తవిద్యలు నేర్పినాడు. అలనాడు సాందీపుడు, ఈనాడు రఘునాథశర్మ రోహిణీనక్షత్రజాతకుడైన అష్టమ సంతానానికి ఆధ్యాత్మికగురువులు. గీతాచార్యుడు చెప్పినట్లు

పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః।
జిజ్ఞాసురపి యోగస్య శబ్ద బ్రహ్మాతి వర్తతే ॥ 6-44

ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః।
అనేకజన్మ సంసిద్ధః తతో యాతి పరాం గతిమ్ ॥ 6-45

పూర్వజన్మల్లో చేసిన అభ్యాసం వృధా కాక అప్రయత్నంగానే అందివచ్చింది రాంవిశ్వంభర్‌కు. అందివచ్చిన ఆధ్యాత్మికవిద్య ముందుకు సాగింది. అతడు ప్రయత్నంతో ఇంకా తీవ్రసాధన చేసి జన్మాంతర సంస్కారముల చేత యోగసిద్ధుడైనాడు. రఘునాథశర్మ దంపతులు రాంవిశ్వంభర్ అధిరోహిస్తున్న యోగభూమికలు చూచి అతడు తమకు దక్కనిమూట అనుకున్నారు. తమ ఋణం తీర్చుకోవటానికి అవకాశమిచ్చిన కారణజన్ము డనుకున్నారు. యౌవనంలో అడుగిడిన రాంవిశ్వంభర్ శ్రీపాద శ్రీవల్లభుల వలె తల్లిదండ్రులకు తన ఆశయం చెప్పి వారి మనసులు కుదుటపరచి సెలవందుకొని ఇల్లు విడిచినాడు. ఇట్లా ఆతడు ఎక్కడెక్కడ ఎన్నేండ్లు తపస్సు చేసినాడో కాని పంజాబు రాష్ట్రంలో సుప్రసిద్ధుడైన గిన్నీబాబా చెంత చేరినాడు. ఇరువురు ఒకే ఆశ్రమంలో ఉంటూ దీర్ఘకాలం తపస్సు చేసినారు.

క్రీ.శ. 18-19 శతాబ్దుల నడిమికాలం భారతదేశానికి గడ్డుకాలం. సామాజిక సమస్యలు, రాజకీయ కల్లోలాలు, విమతీయుల దురాగతాలతో ఉత్తరభారతం అట్టుగికి



పోయింది. శ్రీరాంవిశ్వంభర్‌దాసు పంజాబు విడిచి మరల దేశసంచారం ప్రారంభించి నాడు. ఆయన తమ యోగమిత్రులొకరు హృషీకేశంలో ఉండేవారనీ ఆయన వయస్సు కూడ తమ వయస్సుతో సమానమనీ తమకు సింహాచలంలో శిష్యులైన రతన్‌బాబుగారికి, నిత్యానందంగారికీ చెప్పినారట. స్వామివారు తమ మిత్రుని కలసి దక్షిణాదికి పయనమై ఒరిస్సాలోని పూరీజగన్నాథ క్షేత్రం చేరినారు. ఆ క్షేత్రంలో తమ గురువుల ఆశ్రమంలో కొంతకాలం తపస్సు చేసినారు. అటుతరువాత భగవదాదేశం ప్రకారం విశాఖపట్నం సింహాచలం కొండకు చేరినారు. అక్కడి ప్రకృతివాతావరణం జలధారలు ఏకాంత గుహలు స్వామికి బాగా నచ్చినవి. తొలిదినాలలో కొంతకాలం ఆకాశగంగ వద్ద దిగంబరంగా నిరాహారులై తపస్సు చేసినారు. అటుతరువాత శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆశ్రమం నిర్మింపజేసుకొని కొండ గుహల్లో ఏకాంతంగా తపస్సు చేసినారు. స్వామి 12 సంవత్సరాలు అన్నపానీయములుడిగి ఈ కొండపైని గుహల్లో కఠోరతపస్సు చేసినారు. స్వామి తపస్సు చేసిన గుహ పైభాగాననే వారి పార్థివశరీరాన్ని సమాధి చేసి భక్తులు శివాలయం కట్టించినారు.

శ్రీరాంవిశ్వంభరదాసస్వామికి సంస్కృతం హిందీ పంజాబీ భాషలు వచ్చు. సింహాచలం చేరిన కొన్నిమాసాల దాక వారు తెలుగులో మాట్లాడలేకపోయినారు. అటు తరువాత ఏండ్లు గడచినకొలది వారు తెలుగులో ధారాళంగా మాట్లాడసాగినారు. స్వామి కొంతకాలం రాలిపడిన ఎండుటాకులు పండ్లు తిన్నారు. అటుతరువాత భక్తులు సమర్పించిన పాలు త్రాగినారు. వారి తపస్సు పూర్తియైన తరువాతనే సాధారణమైన ఆహారం, ఆశ్రమ నిర్మాణమైన తరువాత స్వీకరించినారు. స్వామి 1840 సంవత్సరాల ప్రాంతంలో సింహాచలం చేరినారు. అక్కడికి తరుచుగా వచ్చే భక్తులు స్వామిని ఐదుతరాల వాళ్ళు దర్శించినారట. అందువలన స్వామి అక్కడికి 1840 ప్రాంతంలో చేరినారని ఊహించవచ్చు. విశాఖపట్నం సింహాచలం భక్తులు కొందరు స్వామిని దిగంబరస్వామి అని కొందరు జటలస్వామి అనీ కొందరు గాయత్రీబాబా అని పిలిచేవారు. ఆయన చాలాకాలం మౌనంగానే ఉండినారు. ఎప్పుడోకాని తమకిష్టమైతే మాట్లాడేవారు.

అందుకే ఆయనను మౌనబాబా అన్నారు. స్వామి దిగంబరులు. ఆయన జడలే ఆయనకు అంబరాలు. ఆయన ఆజానుబాహుడు. 6 1/2 అడుగుల ఎత్తు ఐనా వారు నిలుచుంటే జడలు నేలకు తాకేవి. ముందు వెనుకల వారి జడలే వారికి ఆచ్ఛాదనాలు. అందుకే స్వామికి జడలబాబా అని పేరు. ఆశ్రమవాసులైనతరువాత స్వామి కాషాయపు పట్టుపంచె కట్టుకొని పైన కండువ వేసుకున్నారు. ఆయన ఆశ్రమానికి గాయత్రీసదనమని పేరుండటం చేత గాయత్రీబాబా అనే పేరు వచ్చింది.

ప్రస్తుత గాయత్రీసదనం ఆశ్రమ నిర్వహణాధికారి శ్రీ వి.రతన్‌బాబు. ఆయన ఒకప్పుడు తన కొడుకు నిర్మలబాబు పుట్టినదినంనాడు స్వామివారిని తన కొడుకును దీవించండని ప్రార్థిస్తే స్వామి ఆ అబ్బాయి వీపుపై గట్టిగా చరచినారట. ఆ దెబ్బకు అబ్బాయి కెవ్వుమని మూర్ఛపోయినాడు. ఆ దెబ్బతో వాని పూర్వజన్మల కర్మలన్నీ తొలగి పోయినవి. నిర్మలబాబు పెరిగి పెద్దవాడై ఉన్నతవిద్యలు గడించి ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. స్వామివారి అనుంగుశిష్యులలో నిత్యానందం గారొకరు. ఆయన అసలుపేరు బి.ఎన్. మహాపాత్రో. దేవస్థానం రిటైర్డ్ ఇంజనీరు. నిత్యానందం గారికి స్వామి లీలలు స్వామి ఎవరెవరిని ఏ విధంగా అనుగ్రహించినది బాగా తెలుసు. బాబా ఝాన్సీలక్ష్మీబాయిని యుద్ధానికి పోయేముందు దీవించినారనీ, షిర్డీబాబాతో చొంగ పీల్చినారనీ, సింహాచలం జట్కాబండ్లవారు ఐదుతరాలుగా శ్రీవారిని తమ జట్కాల్లో వలసిన చోట్లకు తీసుకపోయినారనీ అంటారు. ఒకసారి మన రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ బాబావారితో చాలాసేపున్నారు. శ్రీవారు పంజాబ్ గిన్నీబాబా స్నేహితులని తెలసి మరల పంజాబ్ తీసుకపోతాను రండని ప్రార్థిస్తే బాబా నిరాకరించారు. లక్ష్మీనరసింహస్వామి ఆదేశం చొప్పుననే తాము సింహాచలం వచ్చినామనీ వారి అనుజ్ఞ లేనిదే మరొకచోటికి పోజాలమనీ చెప్పినారట. జ్ఞానీ జైల్‌సింగ్ బాబావారితో ఒకసారి ఏకాంతం కోరినారట. కాని బాబా నిత్యానందం తమ వెంట తప్పక ఉండవలెనన్నారట. ఒరిస్సాలో పుట్టి సింహాచలంలో ఉద్యోగం చేసి బాబా అనుగ్రహానికి పాత్రుడైన నిత్యానందంగారు ధన్యజీవులు.



శ్రీరాంవిశ్వంభరదాసుగారు నిత్యాగ్నిహోత్రి. ఆయన ప్రతిదినం గాయత్రీ హోమం చేసేవారు. ఆ హోమకుండంలోని విభూతి ఆర్తులకు అర్థార్తులకు జిజ్ఞాసువులకు ప్రసాదంగా ఇచ్చేవారు. విశాఖపట్నం ప్రాంతీయులే కాక చాల దూరదూరాల భక్తులు ఆ వృద్ధస్వామిని ఆశ్రయించి తమ బాధలు, కష్టాలు చెప్పుకొని వారి ఆశీరనుగ్రహంతో స్వస్థచిత్తులయ్యేవారు. శ్రీవారు తొలినాళ్ళలో చిత్తు కాగితాలు చించి భక్తులకు పంచేవారు. వారిచ్చే చిత్తుకాగితపు ముక్కలు రక్షరేకులుగా పనిచేసేవి. ఆయాభక్తుల విపత్తులు తొలగిపోయేవి. ఇప్పటికీ కొందరు భక్తులు ఆ కాగితపు ముక్కలను తమ పూజాగృహాల్లో భద్రంగా దాచుకుంటున్నారు. స్వామి రోగగ్రస్తులకు అక్కడ లభించే ఏవో ఆకుపసర్లు మూలికలు నూరి ఇచ్చి రోగాలు నయం చేసేవారు. శ్రీవారి ఆశ్రమంలో పూర్వపు ఆయుర్వేద వైద్యులిండ్లయందువలె ఖల్వం, నూరేరాయి ఉండేవి. విశాఖపట్నం వాసులైన ఒక జంట గ్రహబాధకు గురియై బాబాను ఆశ్రయించినారు. మొదటి భార్య చనిపోతే చేసుకున్న రెండవభార్యను ఈగ్రహం పట్టి పీడించేది. ఆ బాధలకు తట్టుకోలేక ఆ గృహస్థు బాబాకు శరణాగతుడైనాడు. స్వామి తన కమండలంలోని జలం అభిమంత్రించి గ్రహపీడితురాలైన ఆ యిల్లాలిపై చల్లినారు. ఆమెను ఆవహించింది ఎవరో కాదు. చనిపోయిన ప్రథమకళత్రమే సూక్ష్మశరీరం ధరించి ఈ సవతిని బాధించేది. తన సంతానాన్ని సరిగా చూస్తుందో లేదో అని బాధపెడుతున్నట్లు ఆ సూక్ష్మశరీరం చేత స్వామి పలికించినారు. స్వామి అనుగ్రహంతో ఆ సూక్ష్మశరీరానికి ముక్తీ సవతికి ఆరోగ్యమూ లభించినవి. బొంబాయి నివాసి ధనవంతుడైన ఒక వ్యాపారి తీవ్రంగా జబ్బుపడి పెద్దపెద్ద వైద్యులను ఆశ్రయించి లక్షల ధనం వెచ్చించినాడు కాని ఆతనికి ఆరోగ్యం కుదురలేదు. ఆయనకు సింహాచలం జడలబాబా విషయం ఎవరో చెప్పినారు. ఆ వ్యాపారి వచ్చి స్వామికి శరణాగతుడైనాడు. రెండు దినాలదాక స్వామి ఆతనితో మాట్లాడనేలేదు. వ్యాపారికి పట్టుదల పెరిగి అక్కడే ఉన్నాడు. మూడవదినం స్వామి ధుమధుమలాడుతూ ఆతణ్ణి తన్నినారు. ఇది స్వామి తనను పరీక్షించే తీరనుకున్నాడు ఆగంతుకుడు. స్వామి పెట్టిన పరీక్షలకు నిలద్రొక్కుకున్న ఆ వ్యాపారిపై అనుగ్రహవృష్టి

కురిసింది. ఏదో ఆకు తెచ్చి దాని పసరు తీసి త్రాగుమన్నారు బాబా. ఆ వ్యాపారి కాలకూటంవంటి ఆ చేదును అమృతమట్లు త్రాగినాడు. ఆతడు నీరోగియైనాడు. వ్యాపారి తన జీవితాంతం స్వామిసేవకు అంకితమైనాడు. ఇప్పుడున్న "గాయత్రీ సదనం" ఆశ్రమం స్వామివారి సమాధిమందిరం ఆ వ్యాపారి కట్టించినవే. 23.3.1972 న ఆశ్రమనిర్మాణం పూర్తియైనది. ఆశ్రమంలో జరిగే నిత్యకార్యక్రమాలకు కూడ ఆ వ్యాపారి ఇతోధిక సహాయం లభిస్తున్నది. ఈ విధంగా స్వామి అనుగ్రహానికి పాత్రులైన వారు విశాఖపట్నం పరిసర ప్రాంతాలలో వేలజనం ఉన్నారు. వారు స్వామి మహిమలు కీర్తిస్తుంటారు. కంచరపాలెంలో ఉండే ఒక అనాథబాలికను స్వామి చేరదీసి కన్నబిడ్డవలె ఎత్తుకొని లాలించి ఆటలాడించినారట. స్వామి ఒడిలో ఎదిగిన ఆ బిడ్డ ధన్యురాలు కదా!

స్వామివారు సాధించినది లంబికాయోగమని తెలిసినవారంటారు. ఏండ్లకొలది ఆ యోగనిష్ఠలో ఎంత అమృతపానం చేసినారో బాబా. అందుకే ఆయన అంతదీర్ఘకాలం బ్రతికి సాటి మానవులను ఆదుకొని సన్మార్గగాములను చేసినారు. అవధూతస్థితిలో వారు ఒక్కొక్కప్పుడు ధుమధుమలాడేవారు. ఒక్కొకసారి పసిపిల్లవానివలె వర్తించేవారు, మరొకసారి భూతం ఆవేశించినట్లు నర్తించేవారు. ఈ లక్షణములన్నీ అవధూతలకు యోగులకు సామాన్యములు సాధారణములని గుర్తించిన భక్తులు వారిని విడువకుండా సేవించి కృతార్థులైనారు. వారి కోపతాపాలు మనలోని దుష్టశక్తులను, దుర్గుణాలను దూరం చేయటానికే అని శిష్యులు భక్తులు మరింత చేరువయ్యేవారు. షిర్డీసాయిబాబా ప్రవర్తనం కూడ ఇట్లాగే ఉండేది. స్వామివారి మహిమాన్విత వ్యక్తిత్వానికి ముగ్ధులైన రాష్ట్రపతి జ్ఞానీజైల్‌సింగ్ రెండుసార్లు బాబాను దర్శించి 20 గంటల ఏకాంతం అనుభవించినారు. కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యులవారు 1980 దశకంలో గురుపూజా మహోత్సవాలు సింహాచల క్షేత్రంలో జరిపినపుడు చేరిన భక్తులకు జ్ఞానులకు సాధకులకు బాబావారిని పూజించే భాగ్యం కలిగింది. సన్యాసులకు, అవధూతలకు జందెము ఉండవు కాని గాయత్రీబాబా వారికి యజ్ఞోపవీతం ఉండేది. కనుక బాబా గాయత్రీ



మంత్రసిద్ధుడైన సద్బ్రాహ్మణుడనుకొనవలెను. దేవాదాయశాఖ కమీషనర్ పైడిలక్ష్మయ్య ఆయన భార్య బాబాను సేవించి శ్రీవారు ఆంధ్రదేశంలోని కొన్ని పుణ్యక్షేత్రాలు దర్శించే అవకాశం కలిగించినారు.

గాయత్రీసదనం పక్షమున ప్రకటితమైన "శ్రీరామ విశ్వంభరదాస గురుపూజా విధానము"లో శ్రీవారికి జరిపే షోడశోపచార పూజావిధానం అష్టోత్తరశతనామావళి 25 తెలుగు కీర్తనలున్నవి. అష్టోత్తరశతనామావళిలోని మైత్రేయస గోత్రాయనమః, ఆపస్తంబసూత్రాయనమః, రోహిణీనక్షత్రసంజాతాయనమః, మాధవస్వామి పుత్రాయనమః, ఆర్యావర్తసద్బ్రాహ్మణాయనమః అనే నామాలు స్వామివారి జన్మాదికములకు సంబంధించిన విశేషాలు తెలియజేసేవి. గాయత్రీ ప్రతిరూపాయనమః, పరకాయ ప్రవేశాగ్రగణ్యాయ నమః, ఆసేతుహిమాచలపర్యంతశిష్యపరంపరాయనమః, ఊర్ధ్వగమనాయ నమః, వాయుభక్షణాయ నమః వంటి నామాలు బాబావారి మహిమలు తెలిపే నామాలు. ఇంతటి మహిమాన్వితుడైన స్వామి జీవించియుండగా ఏ పత్రికలోను తమగూర్చి వ్రాయటానికి అంగీకరించలేదు. గాయత్రీబాబా భక్తులు కొందరు పూనుకొని వారి అనుగ్రహానికి పాత్రులైన భక్తుల అనుభవాలు సేకరించినారట. ఆ పుస్తకం ప్రచురించటానికి పూనుకొన్న ఒక న్యాయవాది హఠాత్తుగా చనిపోయినాడట. అందువలన ఆ ప్రయత్నం కొనసాగలేదు. ఒకసారి వి.వి.గిరి గారి కొడుకు శంకరగిరి కొందరు విలేకరులతో వచ్చి బాబా సమాచారం అడిగించి వ్రాయించుకున్నారు. "మీరు దానిని ఏం చేస్తార"ని బాబా అడిగితే అచ్చువేయిస్తాము పత్రికల్లో అన్నారట. బాబా "మీ కండ్లు పోతా"యన్నారట. వారు భయపడి అచ్చు వేయలేదు. స్వామివారు ఏటేటా శరన్నవరాత్రములప్పుడు జరిపే గాయత్రీయజ్ఞం చూచిన వార్తా పత్రికల ప్రతినిధులు స్వామిని వివిధప్రశ్నలడిగి సమాచారం వ్రాసుకున్నారట. స్వామి మీరేమిచేస్తారీ సమాచారం అని అడిగితే పత్రికల్లో ప్రకటిస్తామన్నారు ఆ విలేకరులు. స్వామి ఉగ్రనారసింహులైనారు. ఆ పనిచేస్తే మీరు సర్వనాశనమైపోతారన్నారట. అంతటితో స్వామివారి గూర్చి లోకానికి తెలియపరచవలెననే ప్రయత్నం నిలిచిపోయినదట.